నారుమడి.. నీటి ఎద్దడి

- వేసవిని తలపిస్తున్న ఎండలు
- ఎండిపోతున్న ఖరీఫ్ పంటలు
- తుని సబ్ డివిజన్‌లో తక్కువ వర్షపాతం నమోదు

తుని రూరల్: ఖరీఫ్ వరిసాగుకు నీటి ఎద్దడి నెలకొంది. వేసవిని తలపించేలా కాస్తున్న ఎండలకు వ్యవసాయ శాఖ తుని సబ్ డివిజన్ పరిధిలో ఖరీఫ్ వరి నారుమడులు ఎండిపోతున్నాయి. వర్షాకాలం మొదలై మూడో నెలలు గడుస్తున్నా సాధారణ వర్షాలు కురవలేదు. సాగునీటి ఎద్దడితో వరి నారుమడులకు నష్టం వాటిల్లుతోంది. బోరుబావుల ఆధారంగా వేసిన వరినారుతో అక్కడక్కడ కొంతమంది నాట్లు వేస్తున్నా భారీ వర్షాలు కురిస్తేనే పంట దక్కేదని రైతులు పేర్కొన్నారు. ఈ సంవత్సరం సాధారణ సాగు లక్ష్యం ఎంత మేరకు జరుగుతుందా ? అని వ్యవసాయ అధికారులు వేచి చూస్తున్నారు. కోటనందూరు మండలంలో సాధారణ వర్షపాతం నమోదు కాగా తుని, రౌతులపూడి, శంఖవరం, తొండంగి మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది.

సాధారణ సాగు 15124 హెక్టార్లు

వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ ఐదు మండలాల పరిధిలో ఖరీఫ్‌లో సాధారణ వరిసాగు 15124 హెక్టార్లు కాగా రైతులు 396 హెక్టార్లలో వరినారు వేశారు. ఇటీవల పంపా రిజర్వాయర్, పుష్కర కాలువల నుంచి నీరు విడుదలవ్వడం, బోరుబావుల కింద కొంతమంది రైతులు వరినాట్లు ప్రారంభించారు. ఇలా ఇప్పటి వరకు 487 హెక్టార్లలో నాట్లు వేసినట్టు అధికారులు గుర్తించి, పంట నమోదు చేస్తున్నారు. ఈ నెల రెండో వారంలో తుపాన్ల ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని, పంపా, తాండవ, ఏలేరు జలాశయాలతో పాటు పుష్కర, పీబీసీ కాలువల నుంచి సాగునీరు అందనుందని అధికారులు పేర్కొన్నారు. దాంతో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరమయ్యే అవకాశం ఉంది.



డి.పోలవరంలో నీటి ఎద్దడితో ఎండిపోతున్న నారుమడి

రేపు తాండవ నీరు విడుదల

తాండవ జలాశయం నుంచి ఆదివారం కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 380 అడుగులు కాగా ప్రస్తుతం 371.16 అడుగులు నీటి నిల్వలు ఉన్నాయి. గోదావరి జలాలు మళ్లించడం ద్వారా పంపా, ఏలేరు జలాలను ఆయకట్టుకు విడుదల చేస్తున్నారు. ఈ నీటితో నారుమడులు రక్షించుకునే పనుల్లో మెట్ట రైతులు ఉన్నారు. పుష్కర కాలువకు శివారుగా ఉన్న తుని మండలానికి సమృద్ధిగా నీరు చేరాలంటే ఎగువ ఆయకట్టుదారులు అడ్డుకట్టులు వేయకుండా ఉండాలి.



చామవరంలో నాట్లు వేయక బీడువారిన భూములు

తుని సబ్ డివిజన్‌లో నమోదైన వర్షపాతం వివరాలు (మిల్లీ మీటర్లలో)

మండలం	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం
తుని	323.3	236.9
తొండంగి	293.1	251.4
కోటనందూరు	234.0	238.8
రౌతులపూడి	363.1	305.5
శంఖవరం	363.1	259.5

సబ్‌డివిజన్‌లో సాధారణ సాగు, నారుమడులు, నాట్ల వివరాలు (హెక్టార్లలో..)

మండలం	సాధారణ సాగు	నారుమడులు	నాట్లు వేసిన విస్తీర్ణం
తుని	2731	57	13
తొండంగి	5193	169	228
కోటనందూరు	4023	20	122
రౌతులపూడి	2066	124	105
శంఖవరం	1111	26	19
మొత్తం	15124	396	487

నారుమడి ఎండిపోతోంది

నారప్ప చెరువు ఆయకట్టులో మూడు ఎకరాలు భూమి ఉంది. నాట్లు వేసేందుకు అవసరమైన నారు వేశాను. చెరువులో నీటి నిల్వలు లేకపోవడం, వర్షాలు కురవకపోవడంతో నారుమడి ఎండిపోతోంది. తాండవ రిజర్వాయర్ నుంచి నీరు విడుదల చేస్తే చెరువుకు వస్తుంది. అప్పటి వరకు నారుమడి ఎండిపోకుండా ఉంటే చెరువు నుంచి చేరే సాగునీటితో నాట్లు వేస్తాను. ఈ సమయంలో వర్షం కురిస్తే నారుమడి ప్రాణం పోసుకుంటుంది.

– ఎ.సత్యనారాయణ, రైతు, డి.పోలవరం

పంట నమోదు చేస్తున్నాం

అధిక ఉష్ణోగ్రతలతో ఆకుమడులకు నీటి ఎద్దడి నెలకొంది. వాతావరణశాఖ అధికారులు అంచనాల ప్రకారం ఈ నెల 11 తర్వాత తుపాన్ ప్రభావం ఉంటుంది. పంపా, తాండవ, ఏలేరు రిజర్వాయర్ల నుంచి సాగునీరు విడుదలయితే ఎక్కువశాతం నాట్లు పడే అవకాశం ఉంది. వర్షాలు కురిస్తేనే పూర్తిస్థాయిలో ఖరీఫ్ సాగు జరుగుతుంది. నాట్లు వేసిన ప్రతి సెంటు భూమికి పంట నమోదు చేస్తున్నాం. బీమా చేయించుకోవడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనం కలుగుతుంది.

– బి.అశోక్‌కుమార్, ఏఓ, తుని మండలం.

క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వర స్వామి జన్మదిన వేడుకలు



ఏలేశ్వరంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: శ్రావణ పౌర్ణమి, శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని కలియుగదైవం వేంకటేశ్వర స్వామి జన్మదిన వేడుకలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ అనుబంధ దుర్గావాహిని, మాతృశక్తి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామివారి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆలయంలో విష్ణుసహస్ర పారాయణ, భగవద్గీత, హనుమాన్ చాలీసా పఠించారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పరిషత్ జిల్లా కార్యదర్శి చిక్కం సత్యనారాయణ, మండల కార్యదర్శి కటకం కిరీటి, గిరిజ, కామాక్షి,సుభాషిణి, రమాదేవి, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి పరామర్శ



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో నూకరాజును పరామర్శిస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన గుమ్మిడి నూకరాజు అనారోగ్యంతో స్థానిక సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నాడు. వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు శనివారం నూకరాజును పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్య మైఖేల్‌ను కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ముదునూరి సీతారామరాజు, బొల్లు నాగేశ్వరరావు, జువ్వల దొరబాబు, నానిపల్లి వెంకన్న, మారెళ్ళ అప్పన్నబాబు తదితరులు ఉన్నారు.

సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టుకు నీరు విడుదల



ఇ.గోకవరంలో సుబ్బారెడ్డి సాగర్ జలాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు రూరల్: సాగర్ ఆయకట్టు పరిధిలో చివరి ఎకరాకూ సాగునీరు అందించమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని ఇ.గోకవరంలో 10 వేల ఎకరాలకు సాగునీరు అందించే మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టుకు శనివారం ఎమ్మెల్యే నీరు విడుదల చేశారు. తొలుత గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుబ్బారెడ్డి సాగర్ అభివృద్ధికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నియోజకవర్గంలో రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు చైర్మన్ ఇళ్ల అప్పారావు, వైస్ చైర్మన్ దేప రాజబాబు, సాగర్ నీటి సంఘం అధ్యక్షుడు బొల్లు సోమననదొర పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

ప్రత్తిపాడు: జాతీయ రహదారిపై పుంత చెరువు జంక్షన్ వద్ద వేంచేసిన సంతోషిమాత ఆలయంలో రాఖీ పౌర్ణమి, సంతోషిమాత జన్మదినం, ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కనపర్తి సత్యనారాయణ పూజా సామగ్రిని అందజేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ప్రత్తిపాడు, కిర్లంపూడి, ఏలూరు, చిన్నింపేట తదితర గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

రేషన్ బియ్యం పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు



గోకవరం రేషన్ షాపులో బియ్యం తనిఖీలు

గోకవరం: రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడి బియ్యాన్ని పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సహాయ పౌరసరఫరాల అధికారి నాగాంజనేయులు రేషన్ డీలర్లను హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన విస్తృత తనిఖీల్లో భాగంగా శనివారం ఎంఎస్ఓ శాంతిప్రియతో కలసి గోకవరం మండలంలోని పలు రేషన్ షాపులను తనిఖీ చేశారు. రేషన్ పంపిణీపై లబ్ధిదారులను ఆరా తీశారు. రేషన్ సక్రమంగా పంపిణీ చేయకపోతే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. జేసీ చిన్నరాముడు, డీఎస్ఓ పార్వతి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

- అన్నదమ్ములకు రాఖీలు కట్టిన సోదరీమణులు
- గ్రామాల్లో పండగ వాతావరణం

ఏలేశ్వరం/ప్రత్తిపాడు/ ప్రత్తిపాడు రూరల్/రౌతులపూడి: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీపౌర్ణమి (రక్షాబంధన్) వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. అన్నలకు చెల్లెళ్లు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కట్టడంతో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఉదయం నుంచే రాఖీలు చేతబట్టుకుని చెల్లెళ్లు సందడి చేశారు. రాఖీలు కట్టిన చెల్లెళ్లకు అన్నలు తమకు తోచిన రీతిలో బహుమతులు అందజేశారు. పట్టణంలో బ్రహ్మకుమారీలు వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి, మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందుకు రాఖీలు కట్టారు.

బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో...

ప్రత్తిపాడులోని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో బ్రహ్మకుమారి తులసీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. బ్రహ్మకుమారీలు గ్రామంలోని ప్రముఖుల వద్ద వెళ్లి రాఖీలు కట్టారు. ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి, డిప్యూటీ కలెక్టర్ ఎ.శ్రీనివాసరావు, ఫిజియోథెరపిస్టు శ్రీరామ్, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ, మినర్వా విద్యా సంస్థల అధినేత రమేష్‌రాజుతోపాటు స్థానిక అగ్నిమాపక కేంద్రం, పోలీస్ సర్కిల్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ తదితర ప్రభుత్వ ఆఫీసులకు బ్రహ్మకుమారీలు వెళ్లి అధికారులు, సిబ్బందికి రాఖీలు కట్టారు.



ఏలేశ్వరంలో వైఎస్సార్ సీపీ నేత గోవిందుకు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

రైతులు వరినాట్లకు సిద్ధం కావాలి

- వ్యవసాయశాఖ ఏడీ శ్రీనివాస్

జగ్గంపేట: వచ్చే వారం రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు వరినాట్లకు సన్నద్ధం కావాలని వ్యవసాయశాఖ ఏడీ గరిమెళ్ల శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో నారుమడులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సిబ్బందితో ఖరీఫ్ వరిసాగుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట మండలంలో ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 9,300 ఎకరాలు కాగా ఇప్పటివరకూ సుమారు 2500 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పూర్తయ్యాయని తెలిపారు. మరో 500 ఎకరాల్లో వరి విత్తనాలు వెదజల్లారని చెప్పారు. మండలంలో 6000 ఎకరాల్లో వరినాట్లు పడవలసి ఉందన్నారు. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ వరిసాగు ఆలస్యమైందన్నారు.



కాట్రావులపల్లిలో వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాస్

అల్పపీడన ప్రభావంతో వారం రోజుల్లో వర్షాలు కురుస్తాయని, వరినాట్లు వేసుకోవడానికి రైతులను సన్నద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెలాఖరు వరకూ వర్షాలు లేని పక్షంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి నరసింహం, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సోమాలమ్మతల్లికి విశేష పూజలు

గండేపల్లి: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని జాతీయ రహదారిపై జెడ్.రాగంపేటలో వేంచేసిన సోమాలమ్మతల్లికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. భారతీయ ధర్మ పరిషత్ కార్యనిర్వాహక రాష్ట్ర అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి దంపతులతో ఆలయ అర్చకులు అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృత అభిషేకాలు, మండపారాధన, దుర్గాహోమం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు నగదు అందజేస్తున్న చక్రబాబు

ప్రత్తిపాడు: మండలంలోని చినశంకర్లపూడిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు స్థానిక వాస్తుసిద్ధాంతి గణేషుల చక్రబాబు చేయూతను అందిచారు. తనకు పరిచయం ఉన్న వ్యక్తుల నుంచి సుమారు రూ.40 వేలు సేకరించారు. బాధితులు పిరాటి అచ్చారావు, పిరాటి అప్పారావు, మానూరి రాజుబాబు, ముతకల నాగేశ్వరరావు, బుర్రె మణెమ్మ, పులకపూడి సత్యనారాయణకు శనివారం ఆ నగదును అందజేశారు. చక్రబాబుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

పెదమల్లాపురంలో ఆదివాసీ దినోత్సవం



పెదమల్లాపురంలో తమ సమస్యలను ట్రైనీ కలెక్టర్ మనీషాకు వివరిస్తున్న ఆదివాసీ నేత



గోవిందపురంలో జెండా ఎగుర వేస్తున్న ఆదివాసీలు

శంఖవరం: మండలంలోని పెదమల్లాపురం గిరిజన గ్రామంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా ట్రైనీ కలెక్టర్ మనీషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. సబ్ ప్లాన్ ఏరియా మండలాల్లోని ఆదివాసీలు పెదమల్లాపురం తరలివచ్చి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ సాంస్కృతిక ప్రదర్శనలు కోలాటం, నందలాట నిర్వహించారు. అనంతరం ఆదివాసీలు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఆదివాసీ హక్కులను పరిరక్షిరక్షణకు కృషి చేయాలని నిర్ణయించుకున్నారు.

ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలి

జగ్గంపేట: మండలంలోని గోవిందపురంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించారు. ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలని, ఆదివాసీల సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని, నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటించాలంటూ ఆదివాసీలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ జక్కంపూడి రాజు మాట్లాడుతూ ఏజెన్సీలో వడ్డీ వ్యాపార నియంత్రణ చట్టాన్ని ఆదివాసీలందరికీ వర్తింప చేయాలని, ఉపాధి హామీ పథకంలో ఆదివాసీలకు 200 రోజులు కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగాలను ఆదివాసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నేతలు నాగులపల్లి అచ్చారావు, మామిడి రాంబాబు, మరిడమ్మ, సంకురమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం

రౌతులపూడి: సబ్‌ప్లాన్ ఏజెన్సీ ఆదివాసీ ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక గుమ్మరేగుల సెంటర్‌లోని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ సబ్‌ప్లాన్ ఏజెన్సీ గ్రామాలు ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. అధికారులు స్పందించి గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, ఏజెన్సీతో సమానంగా సబ్‌ప్లాన్ ఏజెన్సీ గిరిజనులకు సమాన హక్కులు, విద్యా, ఉద్యోగ రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. పలువురు ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జోరువాన



ఏలేశ్వరంలో కురుస్తున్న వర్షం

ఏలేశ్వరం: పట్టణంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండతో పాటు ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడింది. కొద్దిరోజులుగా ఎండలతో అల్లాడిన ప్రజలు వర్షానికి ఉపశమనం పొందారు. నారుమళ్లు ఎండిపోతున్న తరుణంలో వర్షం పడడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు అనుకూలించక నారుమళ్లు ఎండిపోతున్నాయి. చెరువు నీరు, బోర్ల నీటితో రైతులు నెట్టుకొస్తున్నారు.

రోగులకు ఆహార పొట్లాల పంపిణీ

ప్రత్తిపాడు: సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకల పురస్కరించుకుని ప్రత్తిపాడులో శనివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మహేష్‌బాబు అభిమాన సంఘం అధ్యక్షుడు సలాది కృష్ణ ఆధ్వర్యంలో దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులు, వారి వెంట వచ్చే సహాయకులకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహేష్‌బాబు ఫ్యాన్స్ సభ్యులు తాతపూడి అనిల్‌కుమార్, కొల్లా అనిల్ కుమార్, కాతేటి రమేష్, జెడ్డా వెంకటేష్, మోర్త వీరబాబు, గెడ్డం నానీ, బత్తిన చినబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్న మహేష్‌బాబు అభిమాన సంఘ అధ్యక్షుడు కృష్ణ

నేడు తాండవ నీటి విడుదల

కోటనందూరు: తాండవ జలాశయం నుంచి ఆయకట్టు అవసరాలకు ఆదివారం నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు డీఈఈ పి.అనురాధ శనివారం తెలిపారు. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత మధ్యాహ్నం 12 గంటలకు గంగమ్మకు హారతి ఇచ్చి నీటిని విడుదల చేస్తారన్నారు. తుని, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు దివ్య, సత్యప్రభలు పాల్గొంటారన్నారు. ఆయకట్టు రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని డీఈఈ కోరారు.

ద్వాదశ పుణ్యనదీ జలాలతో అభిషేకం



స్వామివారికి ద్వాదశ నదీజలాలతో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై శ్రీదేవి, భూదేవి సమేతుడై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ద్వాదశ (12) పుణ్యనదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణం, శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్నదొర, కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. గంగ, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, సింధు, కావేరి, కృష్ణ, తపతి, తుంగభద్ర, భీమ, ప్రాణహిత నదీ జలాలతో ఈ అభిషేకం చేశారు. అనంతరం, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సహిత మహా సుదర్శన యాగం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై ప్రతిజ్ఞ

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలోని రామానుజన్ భవన్ సెమినార్ హాల్‌లో డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులతో ర్యాంగిగ్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు బీవీఎస్ఎస్ ఉదయ్‌నాథ్, సంస్కృతి వర్మ, ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓటీకే విద్యాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవిగా వనదుర్గమ్మ

- ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు
- అమ్మవారికి చండీ, ప్రత్యంగిర హోమాలు

అన్నవరం: రత్నగిరిపై గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వనదుర్గమ్మ శ్రావణమాస జాతర మహోత్సవాలు శనివారం నిర్వహించిన ప్రత్యంగిర, చండీ హోమాల పూర్ణాహుతితో ముగిశాయి. చివరిరోజు అమ్మవారు ఒక చేతిలో శంఖం, మరో చేతిలో చక్రం, ఇంకో చేతిలో చెరుకుగడ, మరో చేతిని అభయహస్తంతో రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు నిర్వహించారు. అనంతరం చండీ, ప్రత్యంగిర హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు కుటుంబ సభ్యులతో కలసి హోమంలో పాల్గొన్నారు.



వనదుర్గమ్మ చండీహోమం పూర్ణాహుతిలో పాల్గొన్న దేవస్థానం ఈఓ సుబ్బారావు

ఒకే సమయంలో రెండు హోమాల పూర్ణాహుతితో అయోమయం

వనదుర్గమ్మ జాతర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద చండీహోమం, ఆలయం దిగువ అంతస్తులో శ్రావణ పౌర్ణిమ సందర్భంగా ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి ఒకే సమయంలో నిర్వహించడంతో భక్తుల్లో అయోమయం నెలకొంది. రెండు హోమాల పూర్ణాహుతి ఉదయం 11 గంటలకే నిర్వహించారు. రెండు హోమ గుండాల్లో ఏక కాలంలో హోమ ద్రవ్యాలు సమర్పించారు. ఆలయం వద్ద జరిగిన చండీహోమంలో ఈఓ వీర్ల సుబ్బారావు పాల్గొనడంతో ప్రత్యంగిర హోమం వద్ద గల వేదపండితులు, అర్చకులు చండీ హోమం వద్దకే వెళ్లిపోయారు. దిగువన అంతస్తులో జరిగిన ప్రత్యంగిర హోమం వద్ద అర్చకుడు, వ్రతపురోహితులు మాత్రమే మిగిలారు. చండీ, ప్రత్యంగర హోమాల పూర్ణాహుతి ఏక కాలంలో కాకుండా కనీసం పావు గంట తేడాలో నిర్వహించి ఉంటే ఈ గందరగోళం ఉండేది కాదు.



రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన వనదుర్గమ్మ

సత్యదేవుని దర్శించిన జిల్లా కలెక్టర్

అన్నవరం: కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రాత్రి రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. ఆయనకు ఆలయం వద్ద పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేయగా ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు. కలెక్టర్ వెంట పలువురు దేవస్థానం అధికారులు, విశ్రాంతి ఆర్ఐ ప్రసాద్ ఉన్నారు.



సత్యదేవుని సన్నిధిలో వేదపండితుల ఆశీస్సులు పొందుతున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్

కల్యాణ మంటపం నిర్మాణానికి విరాళం



కల్యాణ మంటపం నిర్మాణానికి విరాళం అందిస్తున్న దాతలు

తుని రూరల్: తుని పాతబజారు వీధిలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణ మంటపం నిర్మాణానికి భక్తులు రూ.65 వేలు విరాళం అందజేసినట్టు ఆలయ చైర్మన్ కుక్కడపు బాలాజీ శనివారం తెలిపారు. తునికి చెందిన వెలగా శ్రీనివాసరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు లక్ష్మీభావాని, శ్రీరామ్, రత్నాకర్ నగదు విరాళం అందించారన్నారు. దాతలను స్వామివారి శేషవస్త్రాలతో అభినందించారు. ధర్మకర్త దర్భా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగు పడాలని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు శనివారం ఆలయాల్లో పూజలు చేశారు. మండలంలోని ఒమ్మంగి వేణుగోపాలస్వామి ఆలయంలో పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు కొప్పన రాంబాబు, సుంకర సూరిబాబు, చుక్కా రమణ, కొప్పన కోటేశ్వరరావు, గొల్లపల్లి దొరబాబు, దువ్వ వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

గండేపల్లి: గ్రామంలోని పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గండేపల్లిలోని ఒక ఇంటి వద్ద పేకాడుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్సై యువి శివ నాగబాబు తన సిబ్బందితో దాడి చేశారు. పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.2850 స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో ఎవరైనా జూదాలు ఆడితే 94407 96529, 94949 33233 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

దమ్ము చక్రాలతో రోడ్డెక్కితే కఠిన చర్యలు

గండేపల్లి: దమ్ము చక్రాలతో ట్రాక్టర్లు రోడ్డెక్కితే చర్యలు తప్పవని సీఐ వైఆర్కే శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గ్రామాల్లోని రోడ్లు దమ్ము చక్రాల కారణంగా ఛిద్రమవుతున్నాయన్నారు. ట్రాక్టర్ల యజమానులు సాధారణ చక్రాలతో పొలాలకు వెళ్లి అక్కడ ట్రాక్టర్లకు దమ్ము చక్రాలు బిగించుకోవాలన్నారు. రోడ్లను ధ్వంసం చేసి, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏలేశ్వరంలో అన్నదానం

ఏలేశ్వరం: శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలో శనివారం అన్నదానం నిర్వహించారు. స్థానిక వైఆర్‌సీ క్వార్టర్స్‌లోని గీతాశ్రమంలో శ్రీలక్ష్మీ నారాయణస్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం వందలాది మందికి అన్నదానం చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు, బూడి పైడిబాబు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: చిల్లంగిలోని శ్రీనివాసానగర్‌లో వేంచేసిన భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.